క్లుప్తంగా

కరాటేతో ఆత్మస్థైర్యం



ఏటూరునాగారం: కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో కరాటే విద్యార్థులకు బెల్ట్స్ ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కరాటే సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాంలో కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు లిఖితవ్య, రక్షిత, మైథిలి, నాగ లిఖిత, దివ్య, గోపిక, హారిక, అశ్రిత, అలేఖ్యలకు, బెస్ట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎల్లో బెల్ట్‌లను ఆయన అందజేశారు. అలాగే ర్యాంక్ సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అబ్బు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి విక్రయించాలి



ములుగు: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని ఎక్సైజ్ సీఐ సుధీర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో బండారుపల్లి రోడ్డులోని శ్రీ గట్టమ్మ వైన్స్‌ను బుధవారం సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, అమ్మకాల వివరాలను పరిశీలించారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే అనుమతులు రద్దు చేస్తామని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

ప్రత్యేకాధికారి పల్లెనిద్ర



వాజేడు: మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్ మంగళవారం రాత్రి పల్లె నిద్రలో పాల్గొన్నారు. మండల పరిధిలోని దూలాపురం గ్రామంలో ప్రజలతో కలిసి పల్లెనిద్ర చేశారు. ముందుగా గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిన ఆయన వారి నుంచి గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పంచాయతీ సర్పంచ్‌కోరం సాంబయ్య, కార్యదర్శి సురేష్ ఉన్నారు.

బియ్యం అందజేత



ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన గువ్వ మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర పాలసీ అండ్ రీసెర్చ్ ఇన్‌చార్జ్ రాజునాయక్ బుధవారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

ఏటూరునాగారం: అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరన్నారని కాంగ్రెస్‌పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు రఘు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క, తెలంగాణ శాసనసభ ప్రతిపక్ష నేత బట్టి విక్రమార్కను అక్రమంగా అరెస్టు చేయడం అమానుషమన్నారు. దేశంలో ప్రధాన నరేంద్రమోదీ అదానికి దేశ సంపదను దోచిపెట్టి అక్రమాలకు పాల్పడుతున్నారని దీనిపై పార్లమెంట్‌లో కమిటీ వేయాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అరెస్టు చేయడం బాధాకరం అన్నారు. ఈ సమావేశంలో బాలరాజు, ఎల్లయ్య, శ్రీనివాస్, సత్యం, శ్రీనివాస్, హరీష్ నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

చిట్యాల: రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కో ఆప్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రాజమహమ్మద్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మోహిబుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా మైనార్టీ శాఖ అధ్యక్షుడు మొహమ్మద్ నయీముద్దీన్ హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కాబరస్తాన్, ఈద్గాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నైన్‌పాక మజీదు సదర్ సాబ్ రాహ్మద్ హైదర్, అక్బర్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



మంగపేట: పరీక్ష కేంద్రంలో విద్యార్థులు



మంగపేట: కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు



సమయం దాటి పోతుండటంతో పరుగులు తీస్తూ..



ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ఏటూరునాగారం: ఇంటర్మీడియట్ పరీక్షలు మండలంలో బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల బాలికల కళాశాలలో మొదటి రోజులో భాగంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 298 మందికి 257 మంది, ఒకేషనల్ 64 మందికి 61 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ భగవద్గీత తెలిపారు. అలాగే గురుకుల బాలికల కళాశాలలో 134 మందికి 123 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వసుందర తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు విద్యార్థులను స్క్రీనింగ్ చేసి లోపటికి పంపినట్లు పరీక్ష కేంద్రాల ఇన్‌చార్జ్‌లు తెలిపారు. తాగునీటి వసతి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాలను స్థానిక తహసీల్దార్ సంజీవ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. పల్లెల ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ప్రైవేటు వాహనాలలో తరలివచ్చారు. మరికొంత మంది మండల కేంద్రంలోనే ఇంటిని అద్దెకు తీసుకొని ఇక్కడే మకాం వేశారు.



ఏటూరునాగారం: పరీక్ష కేంద్రం వద్ద బారులుదీరిన విద్యార్థులు

మంగపేట: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. కళాశాలలో మొదటి సంవత్సరం 128 మంది విద్యార్థులకు 104 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వెంకటయ్య తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్షలకు 19 మంది గైర్హాజర్

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొదటి రోజు 19 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. జెనరల్ పరీక్షల్లో 116 మందికి గాను 105 మంది హాజరు కాగా, ఒకేషనల్ కోర్స్‌లో 39 మందికి గాను 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఫ్లెయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థినులు



వాజేడు: తనిఖీ చేసి లోనికి పంపుతున్న సిబ్బంది



ఏటూరునాగారంలో..



పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



పరీక్షల సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవ

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ములుగు: ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రజినీలత సూచించారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో కామర్స్ విభాగం, వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవానికి రజినీలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి హక్కులను తెలుసుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌చంద్ర, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకన్న, కామర్స్ అధ్యాపకులు ఎండీ యాకూబ్, డాక్టర్ ఉమాదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సమ్మయ్య, మహేందర్, తేజోలత, విజిత, శంకర్, అనిల్‌కుమార్, శ్రీను, చేరాలు పాల్గొన్నారు.

నియామకం



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: తెలంగాణ రాష్ట్ర సమితి కార్మికుల విభాగం(టీఆర్ఎస్‌కేవీ) మిషన్ భగీరథ జిల్లా నూతన కమిటీని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రవి ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీ, మండలాల కమిటీలను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ద్రోణ, కొండగొర్ల రాజేష్, వీరగోని అఖిల్, ప్రధాన కార్యదర్శిగా సాంబయ్య, సహాయ కార్యదర్శిగా గంట మహేష్, ప్రచార కార్యదర్శులుగా దామోదర్, దుర్గారావు, నారా ప్రశాంత్, గంట మహేష్, దబీర్, లక్ష్మణ్, శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా కమల్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం మండల అధ్యక్షుడిగా గజ్జెలి ప్రశాంత్, మంగపేట మండల అధ్యక్షుడిగా లొంక రాజు, తాడ్వాయి మండల అధ్యక్షుడిగా మెడిశెట్టి వెంకటేష్, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడిగా దుర్గం నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్‌పాషా, కుక్కల చంద్రశేఖర్, సిసింద్రి, రతన్‌సింగ్, సోహెల్, శ్రీకాంత్, రాజు, సూర్య, అంజిబాబు, వలిపాషా, సుమంత్ పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: ఈనెల 17 నుంచి 29 వరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జనగలంచ, మొండ్యాల తోగు, కొండపర్తి, లవ్వాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న పస్రాలో నిర్వహించనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తారని ఎన్నికలు హామీ ఇచ్చి దొడ్డి దారిన తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలను రద్దుపరిచి తిరిగి దొడ్డిదారిన ప్రవేశ పెట్టడం కోసం ప్రయత్నిస్తుందన్నారు. పార్లమెంటులో రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కస్తూ, కబ్జాలో ఉన్న గిరిజనులందరికీ, ఇతర పేదలకు హక్కులు కల్పించాలన్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలకు 58 జీవో ప్రకారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. మడకం హుంగయ్య, జోగయ్య, సోమయ్య, కోసయ్య, లక్ష్మయ్య, భీమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల వెంకట్‌రెడ్డి

కాన్షీరాం జయంతి వేడుకలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో బుధవారం ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలను మాదిగ జేఏసీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం రమేష్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి అంబేడ్కర్ సిద్ధాంతమే మనకు రక్ష, రాజ్యాంగమే దిక్సూచి అని రాజ్యాధికారం వైపు నడిపించిన మహానుబావుడు కాన్షీరాం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం సిద్దార్థ పూలే, మాదిగ జెఏసీ మండల అధ్యక్షుడు తోకల అంజి, యువజన నాయకులు వెంకటేష్, నవీన్, శివ, రాజు ఉన్నారు.



జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మావోయిస్టులకు సహకరించొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న సీఐ కిరణ్

పలిమెల: మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని మహదేవ్‌పూర్ సీఐ కిరణ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మంగళవారం మండలంలోని ముకునూరు గొత్తికోయగూడెంలో ఆర్‌ఐ అపరేషన్స్ సంతోష్, ఎస్సై అరుణ్, సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ కిరణ్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. మావోయిస్టులకు, సంఘ విద్రోహశక్తులైన వారికి గ్రామస్తులు సహాయం అందించవద్దని తెలిపారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడవిని నాశనం చేయకూడదని, నాశనం చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య సూచించారు. కాటారం మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ తనిఖీ చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఆరు నెలలుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీపీ జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు.

పాఠశాలల సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న సుదర్శన్ రెడ్డి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నాయకులగూడెం, రంగరాజాపురం కాలనీలోని పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను ఏఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అలాగే ఆలుబాక, తిప్పాపురం, కొత్తగూంపు, ఎదిర, సూరవీడుచ రామచంద్రాపురం పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలోని ఎఫ్ఎల్ఎన్ రిజిస్టర్లను, రికార్డులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాస్, సీఆర్‌పీ రాజారావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల: మండలంలోని దుబ్యాలలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయత్రం వరకు పురోహితుల వేద మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అలాగే బలిహరణ అనంతరం భక్తుల భోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీలు ఉమేందర్‌రావు, అనితాసంపత్‌రావు, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సంపత్, మండల అధ్యక్షుడు రవిగౌడ్, తిరుపతి, చింతలపెల్లి స్వామిరావు, అడగాని రామారావు, నల్లబెల్లి రవీందర్, గునిగంటి మహేందర్, చదువు మధురమహేందర్‌రెడ్డి, గుర్రం నాగరాజు, సంపత్‌రావు పాల్గొన్నారు.


కంటి వెలుగు శిబిరం ప్రారంభం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ లాలీబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలోని ప్రజలు కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దూరి బాబు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలి



డిజిటల్ బోధనను పరిశీలిస్తున్న కందాల రామయ్య

ఎస్ఎస్ తాడ్వాయి: పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, గణిత విషయ నిపుణులు కందాల రామయ్య అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ, వృత్తి స్వచ్ఛంద సంస్థ వారు స్మార్ట్ క్లాస్ ప్రాజెక్ట్‌లో భాగంగా తాడ్వాయి మండల కేంద్రంలోని ఇందిరానగర్ పాఠశాలకు డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డులు పంపిణీ చేశారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందిరానగర్ పాఠశాలను ఆయన సందర్శించి డిజిటల్ బోర్డు ద్వారా పిల్లలకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌డీఎఫ్‌సీ, వృత్తి స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా జిల్లాలో గుణాత్మక విద్యను పెంపొందించేందుకు నేటి ఆధునిక కాలంలో పిల్లలకు డిజిటల్ విద్యను అందించేందుకు ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డులు పంపణీ చేయడం అభినందనీయమన్నారు. డిజిటల్ బోర్డు ద్వారా బోధనభ్యాసన సులభం అవుతుందన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధనలు నిర్వహించాలని, డిజిటల్ వనరుల పై అవగాహన కల్పించాలన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాబురావు, వృత్తి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గణేష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం బాధ్యతగా చేపట్టాలి

కాటారం: గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకం బాధ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులకు, వాచర్లకు సూచించారు. మండలంలోని ఆదివారంపేట, ఒడిపిలవంచ గ్రామపంచాయతీల్లోని నర్సరీలను బుధవారం ఆయన సందర్శించారు. మొక్కల రకాలు, పెంపకం, నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీల్లో గడ్డిని తొలిగించాలని విత్తనాలు మొలకెత్తని బ్యాగుల్లో లోకల్ సీడ్, పూల మొక్కలు నాటాలని ఆదేశించారు. మొక్కలకు ఉదయం, సాయంత్రం నీరు పట్టాలని తెలిపారు. అనంతరం ఆదివారంపేట, పరికిపల్లి, వీరాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పాలు, బాలామృతం, ఇతర పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చెక్కుల పంపిణీ

చిట్యాల: మండలంలోని కైలాపూర్, తిరుమలపూర్, గుంటూరుపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే సీఎం కేసీఆర్ ధ్యేయమని, నిరుపేదలకు ఆర్థిక భారం కాకుండా వైద్యానికి అయ్యే ఖర్చులను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరెపల్లి మల్లయ్య, నాయకులు చింతల సుమన్, పువ్వాటి వెంకన్న, చేరాల సదానందం, ఆనందం, భానుచందర్, పిట్ట సురేష్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.